క్లుప్తంగా

ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి



తెనాలిఅర్బన్: ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు తీసుకువెళ్ళేది ఆర్టీసీ బస్సులని, అందరు వాటిలో ప్రయాణించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని తెనాలి డిపో నుంచి గోవాడ, క్వారీలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీస్‌లను బుధవారం తెల్లవారుజామున ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ తెనాలి డిపో నుంచి క్వారీకి 30, గోవాడకు 30, శ్రీశైలంకు 8, చెరుకుపల్లి, గోవాడకు అదనంగా మరో 2 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సులు బుధవారం తెల్లవారుజాము నుంచి గురువారం ప్రయాణికుల రద్దీ తగ్గే వరకు తిరుగుతూనే ఉంటాయని చెప్పారు. సాధారణ చార్జీలకే బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ప్రయాణికులందరు ఆర్టీసీ బస్సు సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి నామాలు బహూకరణ



మంగళగిరి టౌన్: నగర పరిధిలోని రెండు వైష్ణవ దివ్యక్షేత్రాల నడుమ ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని శివుని విగ్రహానికి అలంకరించే నిమిత్తం వెండి నామాలను భక్తులు బహూకరించారు. మంగళగిరి నగరానికి చెందిన విడేల సాయిశ్రీనివాస్, హారిక దంపతులు మూడో కన్ను కలిగిన వెండి నామాలను బుధవారం ఆలయ ఈవో జెవి నారాయణకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌కుమార్ శర్మ వెండి నామాలను స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పాలకులు పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో బుధవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసంసిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన కోరారు. యాజమాన్యం, కార్మిక నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఇస్మాయిల్, పుష్పరాజు, పిచ్చయ్య, బాషా, సుబ్బారావు, సామ్రాజ్యం, రిబ్కా, నూర్జహాన్, మాలిన్, గురవయ్య పాల్గొన్నారు.

చిత్తు బొమ్మ ఆట స్థావరాలపై పోలీసుల దాడి

తాడికొండ: మండలంలోని పొన్నెకల్లు పంట పొలాల్లో చిత్తు బొమ్మ ఆడుతున్న స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నిర్వహించిన దాడుల్లో 16 మందితో పాటు, రూ. 16,800ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

బెల్టు షాపుల్లో జోరుగా మద్యం విక్రయాలు

తాడికొండ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం ప్రియుల నెత్తిన పిడుగుపడింది. ఎన్నికలకు 48 గంటల ముందుదుకాణాలకు ఎక్సైజ్ అధికారులు సీల్ వేయడంతో బెల్టు షాపుల ద్వారా విక్రయాలకు నిర్వాహకులు తెరలేపారు. తాడికొండ, తుళ్లూరు మండలాల్లో బెల్టు షాపులు, వ్యక్తిగత సహాయకులను ఏర్పాటు చేసి దుకాణాల వద్దే జోరుగా మద్యం అధిక ధరలకు విక్రయిస్తూ మందు బాబుల జేబులు ఖాళీ చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ఆ వైపు తొంగి చూడకపోవడం వెనుక ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్థానిక పోలీసులు తాడికొండ మండలంలో దాడులు నిర్వహించి 120 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయగా, ఎక్సైజ్ పోలీసులు అటువైపు తొంగిచూసిన దాఖలాలు లేవు. ముందు షట్టర్‌కు సీలు వేసి దొడ్డిదారి నుంచి సరుకు బయటకు తీసి జోరుగా విక్రయాలు జరుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇటువంటి తతంగాన్ని ఎక్సైజ్ అధికారులు అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

పట్టభిషేకం ఎవరికో..!

- నేడు జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు తెనాలి సన్నద్ధం
- నియోజకవర్గంలో 23,358 గ్రాడ్యుయేట్ ఓటర్లు
- మహిళా ఓటర్ల సంఖ్య 10,014
- తెనాలిలో 26, కొల్లిపరలో మూడు పోలింగ్ కేంద్రాలు



తెనాలి కొత్తపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూలు పోలింగ్ కేంద్రం ఎదుట బారికేడ్లు, టెంట్ల ఏర్పాటు

తెనాలి: కృష్ణా – గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు తుదిఘట్టం సమీపించింది. ఎన్నికలకు అభ్యర్థుల ప్రచారపర్వం మంగళవారం సాయంత్రం నాలుగు గంటలతో ముగిసింది. గురువారం ఉదయం 8 గంటల్నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులైన మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పోలీసు అధికారులతో కలిసి తుదివిడతగా పట్టణంలోని వివిధ పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీచేశారు.

పురుష ఓటర్లు అధికం..

తెనాలి పట్టణం, రూరల్ మండలం, కొల్లిపర మండలం పరిధిగా కలిగిన నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు మొత్తం 23,358 మంది ఉన్నారు. వీరిలో పురుషులే అధికం. మొత్తం 13,341 మంది పురుష ఓటర్లు ఉండగా, మహిళా ఓటర్లు 10,014 మంది ఉన్నారు. తెనాలి పట్టణం, రూరల్ మండలం కలిపి గ్రాడ్యుయేట్ ఓటర్లు 20,777 మంది ఉండగా, వీరిలో పురుషులు 11,699 మంది, మహిళా ఓటర్లు 9,076 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఉన్నారు. కొల్లిపర మండలంలో మొత్తం 2,580 మంది ఓటర్లు కాగా, వీరిలో 1642 మంది పురుషులు, 938 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గురువారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం నియోజకవర్గంలో 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పట్టణంలో 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయగా, అందులో రెండు కేంద్రాలను గ్రామీణ ప్రాంత ఓటర్లకు నిర్దేశించారు. ఈ కేంద్రాలు కొత్తపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూలులో ఉన్నాయి. మిగిలిన 24 పోలింగ్ కేంద్రాలు పట్టణ ఓటర్లకు సంబంధించినవని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న చెప్పారు. కొల్లిపర మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం మూడు పోలింగ్ కేంద్రాలను సిద్ధంచేశారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా..

పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను మూడు సెక్టార్లుగా విభజించామని, ఆ ప్రకారం పోలింగ్ పార్టీలు ఎన్నికలను పరిశీలిస్తాయని అధికారులు వెల్లడించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెనాలి – గుంటూరు వయా నారాకోడూరు రోడ్డులో క్వారీ వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, నందివెలుగు మీదుగా రూట్‌మ్యాప్‌ను సిద్ధంచేసినట్టు తెలిపారు మూడు సెక్టార్లను కలిపే విధంగా రూట్‌మ్యాప్‌ను రూపొందించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని అధికారులు వివరించారు. పోలింగ్ అనంతరం మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగనుంది. కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం ఓట్ల లెక్కింపు ఆరోజున గుంటూరు ఏసీ కాలేజీలో జరిపేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను ప్రకటిస్తారు.

కేంద్రాల పరిధిలో 144 సెక్షన్



మారీసుపేటలోని పోలింగ్ కేంద్రం వద్ద తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, కమిషనర్

వివిధ ప్రాంతాల్నుంచి పోలింగ్ అధికారులు, సిబ్బంది బుధవారం మధ్యాహ్నానికి తెనాలికి చేరుకుంటారు. సంబంధిత మెటీరియల్‌తో సహా సాయంత్రానికి ఆయా కేంద్రాలకు చేరుకుంటారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సౌకర్యార్థం టెంట్లు, బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన భోజనం, తాగునీరు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. దీంతోపాటు పోలింగ్ కేంద్రానికి వందమీటర్ల పరిధిని గుర్తించి, బారికేడ్ల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. ఆ పరిధిలో సెక్షన్ 144 నిషేధాజ్ఞలను విధిస్తూ తహసీల్దార్ గోపాలకృష్ణ ఉత్తర్వులు జారీచేశారు. పోలింగ్ కేంద్రాలకు వందమీటర్ల పరిధిలో నలుగురికన్నా ఎక్కువగా ప్రవేశించటం చట్టరీత్యా శిక్షార్హమని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లకు ఇప్పటికే స్లిప్పులను పంపిణీ చేశారు. ఇంకా ఎవరికైనా ఇవ్వకపోయినా, ఇచ్చినవి మిస్సయినా హెల్ప్‌డెస్క్‌లో సమాచారం తీసుకోవచ్చు. అక్కడే ఓటరు స్లిప్పును పొందేలా ఏర్పాట్లుచేశామని తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన

కొల్లిపర: మండల పరిధిలో కొల్లిపర హైస్కూల్‌లోని మూడు పోలింగ్ కేంద్రాల్లో 2580 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును నేడు వినియోగించుకోనున్నారని, వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతంగా వారి ఓటు వినియోగించుకొనే విధంగా సిబ్బంది కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ అన్నారు. బుధవారం ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అక్కడ ఏర్పాటు చేసిన మౌలిక వసతులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20గ్రామాలల్లోని 2580 మంది పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు వినియెగించుకోన్నట్లు వారిలో 1642 మంది పురుషులు, 938 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పర్యవేక్షణ అధికారి విజయబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవ, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య జాగరణ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై బుధవారం మహా శివరాత్రి సందర్భంగా రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు శివపాద మంజీర నాదం –2, శివరాత్రి నృత్య జాగరణ నిర్వహించారు. సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరగ్గా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య ప్రారంభించారు. 108 మంది తమ నృత్య ప్రదర్శనతో శివునికి నృత్య నివేదన చేశారు. నాట్యాచార్య డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం నృత్య దర్శకత్వంలో ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటగిరి నాగలక్ష్మి, తాళ్లూరి ధరణి, పూజిత, శ్రీమహిత పర్యవేక్షించారు.

అంతటా హర నామస్మరణ



రామేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకారాలు



పర్వతవర్ధనీ సమేత రామేశ్వరస్వామికి రావణబ్రహ్మ వాహనసేవ



మారీసుపేట అప్పలస్వామి గుడిలో నర్మద బాణలింగాలకు అభిషేకాలు

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన శైవాలయాలు

తెనాలి, తెనాలి రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం పట్టణంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుంచే శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలతో మహాశివరాత్రి వైభవం కొనసాగింది. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు. స్థానిక గంగానమ్మపేటలో గల చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీపర్వతవర్ధనీ సమేత శ్రీరామేశ్వరస్వామి (పాత శివాలయం) దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 23వ తేదీనుంచి ఆరంభమైన విషయం తెలిసిందే. పండుగ రోజున ఉదయం నిత్యపూజ, హోమవిధులు, గ్రామ బలిహరణ అనంతరం స్వామివారికి రావణబ్రహ్మ వాహనసేవతో గ్రామోత్సవం నిర్వహించారు. బూర్లె నరసింహారావు, సత్యవాణి, కుటుంబసభ్యులు ఈ సేవను సమర్పించారు. ఆలయానికి భక్తులు పోటెత్తారు. క్యూ లైన్లలో నిలబడి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య ప్రముఖుడు భాస్కరుని శ్రీనివాసరావు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అర్ధరాత్రి నుంచి లింగోద్భవ కాల అభిషేకాలు, స్వామి, అమ్మవార్ల ఎదురుకోల ఉత్సవం, శ్రీపర్వతవర్ధనీ సమేత రామేశ్వరస్వామి వార్ల దివ్య కళ్యాణోత్సవం జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు భాగవతుల శివసుబ్రహ్మణ్యం, కన్నెగంటి భాస్కర రావు, కార్యనిర్వహణాధికారి వీవీ రమణకుమారి తెలియజేశారు.

- పట్టణ మారీసుపేటలోని బాలత్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శివరాత్రి ఉత్సవాలను పర్యవేక్షించారు.
- స్థానిక మారీసుపేటలో వేంచేసి ఉన్న శ్రీకోదండ రామస్వామి వారి దేవస్థానం (శ్రీరాంభక్త అప్పల స్వామి గుడి)లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ధర్మకర్త లంక శివానంద్ కుమార్ ఆధ్వర్యంలో ఎంతో ప్రాశస్త్యమైన 365 నర్మద బాణలింగాలకు ప్రాతఃకాలంలో విశేషంగా పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ప్రదోష వేళ నందీశ్వరునికి అభిషేకం, దీపోత్సవం నిర్వహించారు. గణపతి, లక్ష్మీ గణపతి, మహాలక్ష్మి, దుర్గ, నవగ్రహ, మృత్యుంజయ, రుద్రహోమం జరిపించారు. దుర్గా పూర్ణకుమారి భావగ్ని మండలి సభ్యులచే భజన కార్యక్రమాలు శివనామస్మరణలతో తెల్లవార్లు జాగరణ చేయడం జరిగింది. ధర్మకర్తలు కునపల్లి నారాయణస్వామి, లంక శివానంద్ కుమార్, లంక శివ ఆంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీవిష్ణుభట్ల ఆంజనేయశాస్త్రి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు దినమని ధనుష్ సుబ్రహ్మణ్య శర్మ నిర్వహించారు.
- సుల్తానాబాద్‌లో వేంచేసి ఉన్న శ్రీ గంగాకాశీఅన్నపూర్ణేశ్వరీ సమేత శ్రీవిశ్వేశ్వర స్వామిదేవస్థానంలో మహా శివరాత్రి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి శ్రీ విశ్వేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాలతో పాటు స్వామి వారికి అన్నాభిషేకం కన్నుల పండువగా జరిగింది. చేకూరి సాంబశివరావు, హరిశంకర్‌లు పర్యవేక్షణలో భక్తులకు అన్నదానం చేశారు. పినపాడులోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి అభిషేకాలు జరిగాయి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. పట్టణ రామలింగేశ్వరపేటలోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేశారు. చినరావూరులోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయం, వడ్డెరకాలనీలోని శ్రీఅన్నపూర్ణ కాశీవిశ్వనాథాలయంలోనూ మహాశివరాత్రికి విశేషపూజలు జరిగాయి.

రామేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పణ..

తెనాలి: మహాశివరాత్రి పర్వదినాన పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెసర్లంక వెంకటరమణ, కల్పన దంపతులచే స్థానిక గంగానమ్మపేటలోని శ్రీపర్వతవర్ధనీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. వెంకటరమణ, మిత్ర బృందంచే ఆలయానికి విచ్చేసిన వేలాది భక్తులకు పాలు, మంచినీటి బాటిల్స్, ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తట్టుకూళ్ల అశోక్‌యాదవ్, మల్లెబోయిన రాము, కొడాలి క్రాంతి, పెసర్లంక గోపి, మేకల అప్పారావు, కొణిజేటి రాము, వినయ్, తాడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

సంగం జాగర్లమూడిలో...

రూరల్ మండలం సంగంజాగర్లమూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీబాలత్రిపుర సుందరి సమేత శ్రీసంగమేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే శ్రీ సంగమేశ్వరస్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సంగంజాగర్లమూడి గ్రామం నుంచి కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ప్రభలు ఆలయానికి వచ్చాయి.

మంత్రి మనోహర్ ప్రత్యేక పూజలు...

రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం గంగానమ్మపేటలోని పర్వతవర్ధనీ సమేత రామేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని సంగమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి, అక్కడ స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు.







పట్టువస్త్రాలతో వెంకటరమణ దంపతులు ; శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పూజలు ; పర్వతవర్ధనీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో రామేశ్వరస్వామి



సంగమేశ్వరస్వామికి అభిషేకం



సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రభల కోలాహలం

కొల్లిపరలో...

కొల్లిపర: మహాశివరాత్రి పండుగను బుధవారం మండలవ్యాప్తంగా వివిధ గ్రామాలల్లోని శివాలయాలల్లో ఘనంగా జరుపుకొన్నారు. భక్తిభావం ఉట్టిపడేలా పలు చోట్ల పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాలు నేత్రానందంగా సాగాయి. వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, హనుమాన్ పాలెం, అత్తోట, దావులూరు, జెముడుబాడు ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పంచామృతాభిషేకాలు,జలాభిషేకాలు నిర్వహించారు.

'మిస్టర్ నాగార్జున'కు అభినందన



'మిస్టర్ నాగార్జున' వంశీతో లిఫ్టర్లు, కోచ్‌లు

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 24న జరిగిన అంతర కళాశాలల శరీర సౌష్టవ పోటీల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎస్.వంశీ తన ఆల్‌రౌండ్ ప్రతిభతో బంగారు పతకం సాధించి, 'మిస్టర్ నాగార్జున' టైటిల్‌ను సాధించాడు. మార్చిలో కేరళలో జరగనున్న అంతర యూనివర్సిటీల పోటీలకు ఏఎన్‌యూ తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. స్థానిక గంగానమ్మపేటలోని క్విక్ ఫిట్‌నెస్ ఎరీనాకు చెందిన బాడీబిల్డర్ వంశీని సంస్థ యాజమాన్యం, కోచ్‌లు బుధవారం అభినందించారు. అతడితోపాటు తమ దగ్గర శిక్షణ పొందుతున్న ఎం.షానూన్ మార్చి 17–20 తేదీల్లో జమ్మూకశ్మీర్‌లో జరగనున్న ఆలిండియా పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు కేఎల్‌యూ తరపున ప్రాతినిధ్యం వహిస్తోందని ఎరీనా నిర్వాహకులు తెలిపారు. రానున్న మే నెలలో జరగబోయే ఆసియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు షానూన్ భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనుండటం గర్వకారణంగా చెప్పారు. అదేవిధంగా తమ విద్యార్థిని ఈఎల్ వినయశ్రీ కూడా మే నెలలో జరిగే ఆసియన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు భారత్ తరపున పాల్గొననున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా వంశీ, ఇతర మహిళా లిఫ్టర్లను కేవీఐకే జిమ్ యాజమాన్యం కొమ్మినేని భార్గవ్‌కుమార్, కోచ్‌లు ఘట్టమనేని సాయిరేవతి (కామన్‌వెల్త్ గోల్డ్ మెడలిస్ట్), పూసపాటి శివరామకిరణ్‌రాజు అభినందించారు.

వ్యక్తిపై కత్తితో దాడి



తెనాలిరూరల్: స్వల్ప వివాదం నేపథ్యంలో తెనాలిలో వ్యక్తిపై కత్తితో దాడి జరిగిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. మారీసుపేట పరిధిలో వైకుంఠపురం ఎదురు ప్రాంతంలో నివసించే దేవరకొండ నాగరాజు అనే వ్యక్తిపై చేపల శ్రీను అనే వ్యక్తి కొబ్బరి బొండాల కత్తితో దాడికి దిగటం తీవ్ర కలకలం రేకెత్తించింది. ఓ స్థలానికి సంబంధించిన వివాదంలో నాగరాజుపై చేపల శ్రీను కొబ్బరిబొండాల కత్తితో దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.